### నవంబర్ 10 తర్వాత

ఎన్నికల్లో పాల్గొనే సిబ్బందికి ముందు రోజే పోస్టల్ బ్యాలెట్

50 ఓట్లతో మాక్ పోలింగ్ : డిప్యూటీ డీఈఓ అనుదీప్

# ఓటరు స్లిప్‌లు పంపిణీ





సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ఎన్నికల అధికారి రొనాల్డ్ రాస్, హాజరైన అధికారులు

- ప్రతి పది నుంచి 12 పోలింగ్ స్టేషన్లకు ఒక సెక్టోరియల్ అధికారి
- ఎన్నికల కమిషన్ నిబంధనలు అనుసరించి ఎన్నికలను సమర్థవంతంగా నిర్వర్తించాలి
- శిక్షణ కార్యక్రమంలో జిల్లా ఎన్నికల అధికారి రొనాల్డ్ రాస్

సిటీబ్యూరో, అక్టోబర్ 20 (నమస్తే తెలంగాణ ) : ఎన్నికల కమిషన్ నిబంధనలు అనుసరించి ఎన్నికలను సమర్థవంతంగా నిర్వర్తించాలని జిల్లా ఎన్నికల అధికారి, జీహెచ్‌ఎంసీ కమిషనర్ రొనాల్డ్‌రాస్ అన్నారు. శుక్రవారం బంజారాహిల్స్‌లోని బంజారాభవన్‌లో ఏర్పాటు చేసిన సెక్టోరియల్ అధికారుల శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్నారు. ప్రతి పది నుంచి 12 పోలింగ్ స్టేషన్లకు ఒక సెక్టోరియల్ అధికారిని నియమించినట్లు రొనాల్డ్‌రాస్ చెప్పారు. సెక్టోరియల్ అధికారులు తమ పరిధిలోని ప్రతి పోలింగ్ స్టేషన్‌లను మూడు సార్లు సందర్శించి ఆయా పోలింగ్ కేంద్రాల్లో ఏఎంఎఫ్ (కనీస అవసరాల)లో భాగంగా దివ్యాంగుల సౌకర్యార్థం ర్యాంపులు, తాగునీరు, ఫ్యాన్లు, లైట్లు, ఇంటర్నెట్, సాకెట్స్, మరుగుదొడ్లు తదితర సౌకర్యాలు ఉండేలా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు.

### ఎన్నికల్లో పాల్గొనే సిబ్బందికి ముందు రోజే పోస్టల్ బ్యాలెట్

ఎన్నికల్లో పాల్గొనే పోలింగ్ సిబ్బందికి ముందు రోజే వారికి పోస్టల్ బ్యాలెట్‌ను అందించి అదే రోజు స్వీకరిస్తామని రొనాల్డ్‌రాస్ తెలిపారు. ఈ ఎన్నికల్లో మహిళా పోలింగ్ సిబ్బందికి పోలింగ్ రోజు ఉదయం 5 గంటలకు తమకు కేటాయించిన పోలింగ్ స్టేషన్‌లో రిపోర్ట్ చేసే విధంగా కేంద్ర ఎన్నికల సంఘం వెసులుబాటు కల్పించిందని తెలిపారు. సెక్టోరియల్ అధికారులు తమ పరిధిలోని పోలింగ్ స్టేషన్లలోని పోలింగ్ సిబ్బంది సమాచారాన్ని కలిగి ఉండాలని పేర్కొన్నారు. సెక్టోరియల్ అధికారులకు పోలింగ్‌కు వారం ముందు మెజిస్ట్రీయల్ పవర్స్ ఉంటాయని, తద్వారా ఎన్నికలకు భంగం కలిగించిన వారిపై చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. పోలింగ్ కేంద్రాలకు సంబంధించి రూట్ మ్యాప్‌ను రూపొందించుకొని సిద్ధంగా ఉండాలన్నారు.

### నవంబర్ 10 తర్వాత ఓటరు స్లిప్‌లు..

నవంబర్ 10వ తేదీ తర్వాత బీఎల్‌ఓలు ఓటరు స్లిప్‌లను పంపిణీ చేస్తారని రొనాల్డ్‌రాస్ తెలిపారు. ఈ సారి కొత్తగా ఓటరు సంబంధిత సమాచారాన్ని స్టిక్కర్స్ రూపంలో ప్రతి ఇంటికి అతికిస్తారని తెలిపారు. పోలింగ్ కేంద్రాల్లో ఎటువంటి సమస్య తలెత్తినా సెక్టోరియల్ అధికారులు సమస్యను పరిష్కరించాలని తెలిపారు. ఈవీఎంల పనితీరుపై ప్రిసైడింగ్ అధికారులు సెక్టోరియల్ అధికారులకు సమాచారం అందించాలన్నారు. ఈవీఎంల కమిషనింగ్‌పై త్వరలో అవగాహన కల్పిస్తామని ఆయన చెప్పారు. పోల్ రోజు ముందుగా మాక్ పోల్ నిర్వహించాలని, పోలింగ్ సమయం ముగిసిన అనంతరం క్యూలో నిలబడిన వారందరూ ఓటు వేసే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. పోలింగ్ రోజు మాక్ పోల్ రిపోర్ట్, ఓటరు టర్న్ అవుట్ రిపోర్ట్ ఇతర రిపోర్ట్‌లను ప్రిసైడింగ్ అధికారి సెక్టోరియల్ ఆఫీసర్‌కు అందించడం ద్వారా డీఈఓకు చేరుతుందని తెలిపారు.

### 50 ఓట్లతో మాక్ పోలింగ్ : డిప్యూటీ డీఈఓ అనుదీప్

సెక్టోరియల్ అధికారులు జిల్లా మిషనరీ, ఆర్ఓ, పోలింగ్ బూత్ సిబ్బందికి వారధి లాగా పనిచేస్తారని డిప్యూటీ డీఈఓ అనుదీప్ దురిశెట్టి తెలిపారు. సెక్టోరియల్ అధికారులు తమ పరిధిలోని పోలింగ్ కేంద్రాలను పోలింగ్ రోజు గంట నుంచి గంటన్నర వ్యవధిలో పూర్తిగా సందర్శించే విధంగా ప్లాన్ చేసుకోవాలని పేర్కొన్నారు. పోలింగ్ రోజు ఆయా పోలింగ్ కేంద్రాల్లో ఈవీఎంలు సాంకేతిక సమస్య వచ్చినచో వాటి స్థానంలో కొత్తవి ఏర్పాటు చేయడానికి సెక్టోరియల్ అధికారులు గైడ్ చేయాలని తెలిపారు. మాక్ పోలింగ్ సమయంలో 50 ఓట్లను ప్రతి ఒక్క అభ్యర్థికి, నోటాకు వేసేవిధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఇంతకు ముందు జరిగిన శిక్షణ కార్యక్రమాల్లో సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై అవగాహన కల్పించామని అనుదీప్ దురిశెట్టి తెలిపారు.

### రాజకీయ పార్టీ ఏజెంట్ల సమక్షంలో మాక్ పోల్ : ఆర్వో వెంకటచారి

సెక్టోరియల్ అధికారులకు ప్రీ పోల్, పోల్ ఈవ్, పోల్ డే రోజులలో తీసుకోవాల్సిన చర్యలపై హైదరాబాద్ డీఆర్వో, యాకత్‌పుర ఆర్వో వెంకటచారి సమగ్రంగా వివరించారు. ప్రీ పోల్‌లో భాగంగా వల్నరేబుల్ మ్యాపింగ్, ఓటరు అవేర్నెస్, కనీస వసతులపై చర్యలు తీసుకోవాలని, పోల్ ఈవ్‌లో భాగంగా రాజకీయ పార్టీల ఏజెంట్లు ఉండేలా, ఎలక్షన్ మెటీరియల్, సెక్యూరిటీ పర్సనల్, ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ లా, పోల్ డే రోజు రాజకీయ పార్టీ ఏజెంట్ల సమక్షంలో మాక్ పోల్ నిర్వహించాలని తెలిపారు. ఈవీఎం, వీవీ ప్యాట్ రీప్లేస్‌మెంట్, ఓటరు నమోదు శాతం, రిపోర్ట్‌లపై పనిచేయాల్సి ఉంటుందని వెంకటచారి పేర్కొన్నారు. పోలింగ్ కేంద్రాల్లో 1500 ఓటర్లకు మించిన వాటిని ఆగ్జలరి పోలింగ్ కేంద్రాలపై అవగాహన కల్పించాలని తెలిపారు. పోలింగ్ కేంద్రాలకు దగ్గరలో పార్కింగ్ సౌకర్యాన్ని కల్పించడానికి సంబంధిత ఆర్ఓ, బీఎల్ఓ ద్వారా చర్యలు తీసుకోవాలని తెలిపారు. అక్టోబర్ 4వ తేదీన ప్రచురించిన తుది ఓటరు జాబితాలో ఓటరు పేరు నమోదుతో పాటు సప్లిమెంటరీ ఓటరు లిస్ట్‌లో కూడా ఓటరు పేరు ఉన్నచో ఓటు హక్కుకు అర్హులని వెంకటచారి చెప్పారు. రాజకీయ పార్టీ ప్రతినిధుల వాహనాల పర్మీషన్, డీ ఫేస్‌మెంట్, ప్రీ బీస్ తదితర సమాచారాన్ని అధికారులు పరిశీలించాలని,పోలింగ్ రోజు ఎటువంటి ప్రచారం చేయకుండా ఎంసీసీ ద్వారా చర్యలు తీసుకోవాలి. ఈ సమావేశంలో ఖైరతాబాద్ జోనల్ కమిషనర్, ఆర్ఓ వెంకటేశ్ దోత్రె, అదనపు కమిషనర్ ఎలక్షన్ శంకరయ్య తదితరులు పాల్గొన్నారు.

### పార్టీలకు పలు సూచనలు

- రాజకీయ పార్టీ ఏజెంట్లు ఫోన్ నంబర్లు కలిగి ఉండాలి
- పోలింగ్ కేంద్రానికి 200 మీటర్ల లోపు రాజకీయ పార్టీల ఆఫీస్‌లు ఉండకూడదు.
- ఓటరు జాబితాలో తమ పేరును మరోసారి రీ-చెక్ చేసుకొని పేరు లేని పక్షంలో ఈ నెల 31వ తేదీ వరకు తమ ఓటును నమోదు చేసుకోవచ్చు.
- పోలింగ్ కేంద్రాల్లో మహిళలకు, సీనియర్ సిటిజన్స్‌కు, దివ్యాంగులకు ప్రత్యేక సదుపాయాలు
- సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల్లో మైక్రో అబ్జర్వర్‌ల సమక్షంలో వెబ్ కాస్టింగ్ నిర్వహణ
- ఈవీఎం, బ్యాలెట్ యూనిట్, కంట్రోల్ యూనిట్‌లో ఏదైన సమస్య వచ్చినచో సంబంధిత సామగ్రిని మార్చేందుకు చర్యలు.

## 'డీఆర్‌సీ'లు సిద్ధం చేయండి

### అధికారులను ఆదేశించిన ఎన్నికల అధికారి రొనాల్డ్‌రాస్

సిటీబ్యూరో, అక్టోబర్ 20 (నమస్తే తెలంగాణ) : ఈవీఎంల డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్ (డీఆర్‌సీ) కేంద్రాలను అన్ని వసతులతో సిద్ధంగా ఉంచాలని జిల్లా ఎన్నికల అధికారి, జీహెచ్‌ఎంసీ కమిషనర్ రొనాల్డ్ రాస్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం జిల్లా డిప్యూటీ ఎన్నికల అధికారి, హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్, నగర పోలీస్ కమిషనర్ సందీప్ శాండిల్య, అదనపు కమిషనర్ విక్రమ్ సింగ్ మాన్‌లతో కలిసి నగరంలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించి ఏర్పాటు చేసే డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్ కేంద్రాలను తనిఖీ చేశారు. మొదట బండ్లగూడలోని అరోరా కాలేజీలో ఏర్పాటు చేసే బహదూర్‌పుర నియోజకవర్గం, అంబర్‌పేటలోని జీహెచ్‌ఎంసీ ఇండోర్ స్టేడియంలో ఏర్పాటు చేసే మలక్‌పేట్ నియోజకవర్గ డీఆర్‌సీ కేంద్రాన్ని పరిశీలించి..శుభ్రంగా ఉంచాలని అధికారులకు సూచించారు. అలాగే నారాయణగూడలోని రాజా బహదూర్ వెంకట్రామ్ రెడ్డి కళాశాలలో ఏర్పాటు చేసిన అంబర్‌పేట్ నియోజకవర్గం, యూసుఫ్‌గూడలోని కోట్ల విజయభాస్కర్ రెడ్డి ఇండోర్ స్టేడియంలో ఏర్పాటు చేసే జూబ్లీహిల్స్, ఖైరతాబాద్ నియోజకవర్గాల డీఆర్‌సీ కేంద్రాలను పరిశీలించి ఏవైనా మరమ్మతులు ఉంటే వెంటనే పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. సికింద్రాబాద్‌లోని వెస్లీ కాలేజీలో ఏర్పాటు చేసే సికింద్రాబాద్ కంటోన్మెంట్ నియోజకవర్గం డీఆర్‌సీ కేంద్రాన్ని, ఉస్మానియా యూనివర్సిటీ క్యాంపస్‌లోని కామర్స్, బిజినెస్ మేనేజ్‌మెంట్ కాలేజ్‌లో ఏర్పాటు చేసే సనత్‌నగర్ నియోజకవర్గం డీఆర్‌సీ కేంద్రాన్ని, జి.రామ్‌రెడ్డి దూర విద్యా కేంద్రంలో ఏర్పాటు చేసే సికింద్రాబాద్ నియోజకవర్గ డీఆర్‌సీ కేంద్రాలను పరిశీలించారు. అనంతరం ఎన్నికల అధికారులు, పోలీసు అధికారులు ఎలాంటి పొరపాట్లు జరగకుండా చూసుకోవాలని, ఈవీఎంలను భద్రపరిచే కేంద్రాల వద్ద గట్టి బందోబస్తు చర్యలు తీసుకోవాలని పోలీస్ అధికారులకు సూచించారు. ఈ కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా స్థానిక, కేంద్ర బలగాలతో 24 గంటల పాటు బందోబస్తు ఏర్పాటు చేయాలని పోలీసు అధికారులను రొనాల్డ్‌రాస్ ఆదేశించారు.

## ఆర్టీసీ ప్రయాణికులకు లక్కీడీప్

### ఈ నెల 18 నుంచి 30 వరకు ప్రయాణం చేసే వారికి అవకాశం

సిటీబ్యూరో, అక్టోబర్ 20 (నమస్తే తెలంగాణ) : దసరా పండుగ నేపథ్యంలో నగరంలో సిటీ బస్సుల్లో ప్రయాణం చేసిన వారిని లక్కీ డీప్ ద్వారా ఎంపిక చేయనున్నట్లు ఆర్టీసీ గ్రేటర్ జోన్ సికింద్రాబాద్ రీజియన్ మేనేజర్ తెలిపారు. ఈ నెల 18 నుంచి 30 వరకు సిటీ బస్సుల్లో ప్రయాణం చేసిన వారికి ఈ అవకాశం ఉంటుందన్నారు. ఇందులో ఐదు మంది మహిళలను, మరో ఐదు మంది పురుషులను ఎంపిక చేస్తామన్నారు. లక్కీడీప్ ద్వారా ఎంపికైన ప్రతి ఒక్కొక్కరికీ రూ.9,900 చొప్పున నగదు బహుమతి అందజేయనున్నట్లు తెలిపారు. అయితే ప్రయాణం చేసిన వారు టిక్కెట్ వెనక భాగంలో పేరు, అడ్రసు, సెల్‌ఫోన్ నంబర్లను నమోదు చేయాలన్నారు. ఈ అవకాశాన్ని సిటీ బస్సు ప్రయాణికులు పెద్ద సంఖ్యలో సద్వినియోగం చేసుకోవాలని ఆర్టీసీ సికింద్రాబాద్ ఆర్ఎం పిలుపునిచ్చారు.

### అందుబాటులోకి వచ్చిన..

## చీరాల-బాపట్ల మధ్య మూడో రైలు మార్గం

సిటీబ్యూరో, అక్టోబర్ 20 (నమస్తే తెలంగాణ) : దక్షిణ మధ్య రైల్వే జోన్ విజయవాడ డివిజనల్ రైల్వే పరిధిలో చీరాల-బాపట్ల రైల్వే స్టేషన్ల మధ్య 16.7 కిలోమీటర్ల మేర మూడో రైలు మార్గం పూర్తయి అందుబాటులోకి వచ్చినట్లు శుక్రవారం రైల్వే అధికారులు తెలిపారు. విజయవాడ-గూడూరు స్టేషన్ల మధ్య 189 కిలో మీటర్ల మేర కొనసాగుతున్న మూడో రైల్వే మార్గం ప్రాజెక్టులో భాగంగా ఈ సెక్షన్‌లో పనులు పూర్తయ్యాయన్నారు. అలాగే ముఖ్యంగా ఆయా మార్గంలో సరుకు రవాణా కోసం ప్రయాణం సమయం కూడా తగ్గడానికి అవకాశం ఉంటుందన్నారు. అయితే విజయవాడ-గూడూరు.. 2015-16 సంవత్సరంలో 288 కిలోమీటర్ల మేరకు ప్రతిపాదించిన మూడో రైలు మార్గం కోసం రూ.3,246 కోట్లు మంజూరు చేశారన్నారు. అయితే ఈ ప్రాజెక్టు రైల్వే వికాస్ నిగమ్ లిమిటెడ్ ద్వారా చేపట్టారని అధికారులు తెలిపారు. ఇప్పటికే చీరాల-కరవడి స్టేషన్ల మధ్య 45 కిలోమీటర్లు, గూడూరు-సింగరాయకొండ మధ్య 127 కిలోమీటర్లు మూడో లైను పనులు పూర్తయ్యాయని పేర్కొన్నారు.

# ఎన్నికల సామగ్రి..ర్యాండమైజేషన్ పూర్తి

సిటీబ్యూరో, అక్టోబర్ 20 (నమస్తే తెలంగాణ ) : జిల్లాలోని 15 నియోజకవర్గాలకు సంబంధించిన ఎన్నికల నిర్వహణను సమగ్రంగా నిర్వహిస్తున్నామని జిల్లా ఎన్నికల అధికారి, జీహెచ్‌ఎంసీ కమిషనర్ రొనాల్డ్ రాస్ తెలిపారు. శుక్రవారం జీహెచ్‌ఎంసీ ప్రధాన కార్యాలయంలో కమాండ్ కంట్రోల్ రూంలో ఎన్నికల్లో వినియోగించే ఈవీఎంలు, బ్యాలెట్ యూనిట్, వీవీప్యాట్‌ల మొదటి ర్యాండమైజేషన్‌ను రాజకీయ పార్టీల ప్రతినిధులు, డిప్యూటీ డీఈఓ అనుదీప్ దురిశెట్టి సమక్షంలో జిల్లా ఎన్నికల అధికారి పూర్తి చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ శంకరయ్య, జాయింట్ కమిషనర్ మంగతాయారు, ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.

### మేడ్చల్ జిల్లాలో.. మొదటి విడత ర్యాండమైజేషన్

- 2997కు పెరిగిన బీయూ, సీయూలు
- 3356కు పెరిగిన వీవీప్యాట్లు

మేడ్చల్ కలెక్టరేట్, అక్టోబర్ 20 : జిల్లాలో మొదటి విడత ఎన్నికల కంట్రోల్ యూనిట్లు, బ్యాలెట్ యూనిట్లు, వీవీ ప్యాట్ల ర్యాండమైజేషన్ ప్రక్రియను పూర్తి చేశారు. శుక్రవారం జిల్లా కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో కలెక్టర్ గౌతమ్, అదనపు కలెక్టర్లు విజయేందర్ రెడ్డి, అభిషేక్ అగస్త్య, డీఆర్వో హరిప్రియ, రిట్నరింగ్ అధికారులు, గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో జిల్లాలోని 5 నియోజకవర్గాలకు సంబంధించి జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ గౌతమ్ ప్రక్రియను పూర్తి చేశారు. జిల్లా వ్యాప్తంగా 5 నియోజకవర్గాల్లో పోలింగ్ స్టేషన్లు 2397కు బ్యాలెట్ యూనిట్లను 25 శాతం ర్యాండమైజేషన్ చేయగా ప్రక్రియ తర్వాత 2997 అయ్యాయి. అలాగే కంట్రోల్ యూనిట్లు 2397 ఉండగా ప్రక్రియ తర్వాత 2997 అయ్యాయి. వీవీ ప్యాట్లు 2397కు గాను 40 శాతం ర్యాండమైజేషన్ చేయగా 3356కు పెరిగాయని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ గౌతమ్ వివరించారు. గుర్తింపు పొందిన అన్ని రాజకీయ పార్టీల నాయకులు, ప్రతినిధులకు ఎన్నికల సామగ్రి, కౌంటింగ్, స్ట్రాంగ్‌రూం తదితర అంశాలపై అవగాహన కల్పించారు. అంతకు ముందు కలెక్టరేట్ ఆవరణలోని ఈవీఎం గోడౌన్లకు గుర్తింపు పొందిన రాజకీయ నాయకులను అధికారులు తీసుకెళ్లి, అవగాహన కల్పించారు.



ర్యాండమైజేషన్ ప్రక్రియను ప్రారంభిస్తున్న మేడ్చల్ కలెక్టర్ గౌతమ్